# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 27-01-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** **ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు ఢిల్లీలోని కరియప్ప పరేడ్ మైదానంలో జరిగే వార్షిక నేషనల్ కాడెట్ కోర్ -ఎన్‌సిసి కార్యక్రమంలో ప్రసంగింస్తారు.**

**2.** **గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో బర్నింగ్ వార్డును ఏర్పాటు చేస్తామని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.**

**3.** **రాష్ట్రంలోని అన్ని వాణిజ్య భవనాలలో పొగ సంగ్రహణ వ్యవస్థ తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలని అగ్నిమాపక శాఖ తెలిపింది.**

**4.** **విశాఖపట్నం ఉక్కు పరిశ్రమకు కేంద్రప్రభుత్వం నిధులు మంజూరు చేయడాన్ని స్వాగతిస్తున్నామని తిరుపతి పార్లమెంట్ సభ్యులు మద్దెల గురుమూర్తి తెలిపారు.**

**5.** **ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి చెందిన శంబర పోలమాంబజాతర ఈరోజు ప్రారంభమైంది.**

==========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు ఢిల్లీలోని కరియప్ప పరేడ్ మైదానంలో జరిగే వార్షిక నేషనల్ కాడెట్ కోర్ -ఎన్‌సిసి కార్యక్రమంలో ప్రసంగింస్తారు. ఈ సంవత్సరం 'యువ శక్తి, వికసిత్ భారత్' ఇతివృత్తంతో నిర్వహించే ఈ కార్యక్రమంలో 800 మందికి పైగా క్యాడెట్లతో సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించనున్నారు. ఇంకా, ఈ ర్యాలీలో 18 దేశాల నుండి 144 మంది యువ క్యాడెట్లు పాల్గొంటారు. అంతేకాకుండా, దేశవ్యాప్తంగా ఉన్న మేరా యువ భారత్, కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ, కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖల నుండి 650 మందికి పైగా వాలంటీర్లు కూడా ర్యాలీలో ప్రత్యేక అతిథులుగా పాల్గొననున్నారు.

-------------------------

గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో బర్నింగ్ వార్డును ఏర్పాటు చేస్తామని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. గ్యాస్ సిలెండర్ పేలిన ఘటనలో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని మంత్రి నిన్న పరామర్శించారు. వారి అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలలో గాయపడిన వారికి బర్నింగ్ వార్డు చాలా ఉపయోగపడుతుందని చెప్పారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సహాయం అందిస్తామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ ( 29 సెకన్లు)

-------------------------

రాష్ట్రంలోని అన్ని వాణిజ్య భవనాలలో విద్యుత్ నిర్వహణ, పొగ సంగ్రహణ వ్యవస్థ తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలని అగ్నిమాపక శాఖ సంచాలకులు మాది రెడ్డి ప్రతాప్ ఆదేశించారు. శ్రీకాకుళంలోని ఓ షాపింగ్ మాల్ లోపల ఇలాంటి వ్యవస్థ లేకపోవటం వల్ల తాజాగా జరిగిన అగ్ని ప్రమాదంలో మంటల్ని అదుపు చేయడం కష్టంగా మారిందని చెప్పారు. ఇలాంటి ఘటనల్ని నియంత్రించేందుకు భవనాల యాజమాన్యాలు తప్పనిసరిగా మార్గదర్శకాలు పాటించాలని సూచిస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. భవనంలోని అన్ని అంతస్తుల్లో పొగ సంగ్రహణ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఏదైనా అంతస్తులోకి పొగ వస్తే, దాని స్థానంలో గంటకు కనీసం 12 సార్లు తాజా గాలిని భర్తీ చేసేలా ఈ వ్యవస్థ ఉండాలని సూచించారు.

---------------------------

విద్యుత్ బిల్లులను తగ్గించుకునేందుకు ప్రధానమంత్రి సూర్యఘర్ బిజిలి పథకం దోహదపడుతుందని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సూర్యఘర్ పథకం అమలుపై సంబంధిత అధికారులతో ఆయన ఈ రోజు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సూర్యఘర్ పథకంపై విస్తృత ప్రచారాన్ని నిర్వహించి ప్రతి ఒక్కరూ వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న రాయితీతో ఇళ్లపై సౌర ఫలకాల ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. సౌర ఫలకాలను ఏర్పాటు ద్వారా ఉచిత విద్యుత్ పొందడమే కాక మిగులు విద్యుత్ ను విక్రయించవచ్చని తెలిపారు.

---------------------------

విశాఖపట్నం ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేయకుండా కేంద్రప్రభుత్వం నిధులు మంజూరు చేయడాన్ని స్వాగతిస్తున్నామని తిరుపతి పార్లమెంట్ సభ్యులు మద్దెల గురుమూర్తి తెలిపారు. తిరుపతిలో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ, కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామిని రాష్ట్ర పార్లమెంట్ సభ్యుల బృందం కలిసి విశాఖ ఉక్కు పరిశ్రమపై వినతి పత్రం సమర్పించామన్నారు. ఉక్కు కర్మాగారానికి సొంత గనుల కేటాయింపు విషయంపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆయన తెలియజేస్తూ,..

వాయిస్ (35 సెకన్లు)

---------------------------

ప్రయాగ్ రాజ్ లోని మహా కుంభమేళా జరుగుతున్న ప్రాంతాన్ని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఈరోజు నుంచి వాహన రహిత ప్రాంతం –నో వెహికల్ జోన్‌గా ప్రకటించింది. ఈనెల 29వ తేదీన మౌని అమావాస్య రోజున భారీగా తరలివచ్చే భక్తుల రద్దీని సజావుగా నిర్వహించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. రద్దీని పర్యవేక్షించడానికి ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ అండ్ కమాండ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఇది ఇలా ఉండగా కేంద్ర హోం మంత్రి శాఖ అమిత్ షా మహా కుంభమేళాలో పాల్గొనేందుకు ఈరోజు ఉత్తరప్రదేశ్ లోని ప్రయోగరాజ్ చేరుకున్నారు. అనంతరం త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఈ సందర్భంగా పలువురు ఆధ్యాత్మిక వేత్తలతో అమిత్ షా సమావేశమైవుతారని అధికారులు తెలిపారు..

---------------------------

ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి చెందిన శంబర పోలమాంబ జాతర ఈరోజు ప్రారంభం అయింది. పార్వతీపురం మన్యం జిల్లా, మక్కువ మండలంలోని శంబర శ్రీ పోలమాంబ దేవాలయంలో ఈరోజు నుంచి మూడు రోజుల

పాటు జాతరను నిర్వహించనున్నారు. రాష్ట్ర పండుగగా గుర్తించిన శంబర పోలమాంబ జాతర పై మా ఆకాశవాణి పార్వతీపురం మన్యం జిల్లా ప్రతినిధి సి. హెచ్ శ్రీనివాసరావు మరిన్ని వివరాలను అందజేస్తారు.

వాయిస్ ..26 సెకన్లు

---------------------------

సత్వర న్యాయం పొందేందుకు రాజీ సరైన మార్గమని పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం. సునీల్ కుమార్ తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో న్యాయవాదులకు మధ్యవర్తిత్వంపై ఐదు రోజులు పాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని ఈ రోజు  ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సునీల్ కుమార్ పాత్రికేయులతో మాట్లాడుతూ, మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారంలో మరింత పురోగతి సాధించవచ్చని అన్నారు. మధ్యవర్తిత్వానికి  సంబంధించిన వివిధ అంశాలపై న్యాయవాదులకు అవగాహన కల్పించడంతో పాటు శిక్షణ ఇస్తామని తెలిపారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎం.వెంకట్రావు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ  కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 25 సెకన్లు....

---------------------------

భారత మాజీ రాష్ట్రపతి, రచయిత, స్వాతంత్ర సమర యోధులు ఆర్. వెంకట్రామన్ వర్ధంతి ఈరోజు. తమిళనాడులోని తంజావూరు జిల్లా రాణామాదం గ్రామంలో 1910, డిసెంబర్ 4వ తేదీన జన్మించిన రామస్వామి వెంకట్రామన్ న్యాయ శాస్త్రంలో పట్టభద్రులు. భారత స్వాతంత్ర సంగ్రామంలో ఆయన చురుకుగా పాల్గొన్నారు. స్వాతంత్ర్యం అనంతరం కేంద్ర ఆర్థిక, రక్షణ శాఖ మంత్రిగాను, భారత ఉపరాష్ట్రపతిగాను సేవలు అందించారు."మై ప్రెసిడెన్షియల్ ఇయర్స్" అనే ప్రసిద్ధ గ్రంథాన్ని రచించారు.  1987 నుండి 1992 వరకు భారత రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వర్తించిన వెంకట్రామన్ 2009, జనవరి 27వ తేదీన తుదిశ్వాస విడిచారు.

---------------------------

రాష్ట్రంలో తెలుగు చలన చిత్ర పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ పేర్కొన్నారు. కర్నూలులో ఆంధ్రప్రదేశ్ చలనచిత్ర వాణిజ్య మండలిని ప్రారంభించిన అనంతరం ఆయన  పాత్రికేయులతో మాట్లాడారు.

=====================